# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 08-10-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 70వ జాతీయ చలనచిత్ర పురస్కారాలను ఈరోజు ఢిల్లీలో ప్రదానం చేస్తారు.

2. రాష్ట్రంలో టమాటా, ఉల్లిపాయలను రాయితీతో ప్రజలకు అందుబాటు ధరల్లో విక్రయించేలా ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

3. తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన గరుడ వాహన సేవ ఈరోజు సాయంత్రం జరగనుంది.

4. దసరా మహోత్సవాలను పురస్కరించుకుని విజయవాడ మీదుగా ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణమధ్య రైల్వే అధికారులు వెల్లడించారు.

5. భారత వైమానిక దళ 92వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈరోజు నిర్వహిస్తున్నారు.

==========================

చలన చిత్ర రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన వారికి అందించే 70వ జాతీయ చలనచిత్ర పురస్కారాలను 2022 సంవత్సరానికిగాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు ఢిల్లీలో ప్రదానం చేస్తారు. ఈ సందర్భంగా అత్యుత్తమ సేవలు అందించిన ప్రముఖ నటులు మిథున్ చక్రవర్తిని దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుతో సత్కరించనున్నారు. కన్నడ చిత్రం “కాంతారా”లో నటనకు గాను రిషబ్ శెట్టి ఉత్తమ నటుడు అవార్డును అందుకోనున్నారు. తమిళ చిత్రం “తిరుచిత్రంబలం” చిత్రంలో నటించిన నిత్యా మీనన్, గుజరాతీ చిత్రం “కచ్ ఎక్స్ ప్రెస్” లో నటించిన మానసి పరేఖ్ లకు ఉత్తమ నటి అవార్డును అందజేయనున్నారు. అలాగే తెలుగు ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా ఎంపికైన కార్తికేయ -2 పురస్కారాన్ని అందుకోనుంది.

--------------------------

రాష్ట్రంలో టమాటా, ఉల్లిపాయలను రాయితీతో ప్రజలకు అందుబాటు ధరల్లో విక్రయించేలా ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ధరల నియంత్రణ అంశంపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం కిలో టమాటా ధర బహిరంగ మార్కెట్ లో 70 రూపాయల నుంచి 75 రూపాయల వరకు ఉందని ఈ క్రమంలో దీన్ని రాయితీపై కిలో 50 రూపాయలకే విక్రయించేలా చర్యలు తీసుకోవాలని, కిలో ఉల్లిపాయలను రాయితీపై 45 రూపాయలకు విక్రయించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

--------------------------

తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన గరుడ వాహన సేవకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం కార్య నిర్వహణాధికారి జె. శ్యామలరావు తెలిపారు. ఈరోజు సాయంత్రం జరగనున్న గరుడ సేవ గురించి మరిన్ని వివరాలను మా ఆకాశవాణి తిరుపతి జిల్లా ప్రతినిధి ఎన్.జగదీష్ అందిస్తారు..

..వాయిస్…35 సెకన్లు

-----------------------------

దసరా మహోత్సవాలను పురస్కరించుకుని విజయవాడ మీదుగా ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణమధ్య రైల్వే అధికారులు తెలిపారు. కాకినాడ టౌన్ –సికింద్రాబాద్ ప్రత్యేక రైలు 8, 10, 12 తేదీల్లో , సికింద్రాబాద్ –కాకినాడ టౌన్ రైలును ఈ నెల 9, 11 తేదీలలో విజయవాడ మీదుగా నడపనున్నామని తెలిపారు. అలాగే బీదర్ నాగ్ పూర్ ప్రత్యేక రైలు ఈ నెల 11న బీదర్ లో బయలుదేరి నాగ్‌పూర్ చేరుకుంటుందన్నారు. తిరుగు ప్రయాణంలో ఈ రైలు ఈ నెల 16న నాగ్ పూర్ నుండి బయలుదేరి, మరుసటి రోజు బీదర్ చేరుకుంటుందని ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని రైల్వే అధికారులు కోరారు.

-----------------------------

భారత గగన తలాన్ని కాపలా కాస్తూ… శత్రు కదలికలను నిశితంగా గమనించే భారత వైమానిక దళ 92వ ఆవిర్భావ దినోత్సవం ఈరోజు. 1932 సంవత్సరంలో బ్రిటన్‌కు చెందిన రాయల్ వైమానిక దళానికి మద్దతుగా ఆ ఏడాది అక్టోబరు 8వ తేదీన భారతీయ వైమానిక దళం ఏర్పాటైంది. అప్పటి నుండి ప్రతి ఏటా ఇదే రోజున వైమానిక దళ దినోత్సవం నిర్వహిస్తున్నారు. యుద్ధ సమాయాల్లో శత్రువులపై మెరుపుదాడి చేయడంలో, ప్రకృతి విపత్తుల సమయంలో బాధితులను రక్షించడంలోను వాయుసేన అందిస్తున్న సేవలు నిరుపమానమైనవి.

-----------------------------

రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో అభివృద్ధి పనులకు సంబంధించి ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు వారం రోజుల పాటు 'పల్లె పండుగ' కార్యక్రమాన్ని రాష్ట్రప్రభుత్వం నిర్వహించనుంది. దీనిపై మరిన్ని వివరాలను మా ఆకాశవాణి ప్రతినిధి అందిస్తారు.

వాయిస్ ( 32 సెకన్లు)

-----------------------------

విజయవాడ దసరా మహోత్సవాల్లో భాగంగా ఏడవరోజైన రేపు మూలనక్షత్రం సందర్భంగా భక్తుల రద్దీకి అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. విజయవాడలో నిన్న మంత్రి మాట్లాడుతూ, దసరా ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించిన క్రమంలో వాటిని విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు సులభంగా అమ్మవారి దర్శనం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ ఉత్సవాలకు ప్రత్యేక అధికారిగా దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ కె.రామచంద్ర మోహన్‌ను నియమించినట్లు మంత్రి తెలిపారు.

-----------------------------

కక్షిదారులకు సత్వర న్యాయం అందించేందుకు ఉమ్మడి జిల్లాకు సంబంధించి విజయనగరంలో శాశ్వత

లోక్ అదాలత్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా న్యాయమూర్తి జి.దుర్గయ్య తెలిపారు. విజయనగరంలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ప్రజా ప్రాయోజిత సేవల కోసం శాశ్వత ప్రజా న్యాయ పీఠం లోక్ అదాలత్ ను ఏర్పాటు చేశామన్నారు. ఎటువంటి న్యాయస్థాన రుసుములు చెల్లించాల్సిన అవసరం లేదని, పూర్తి ఉచితంగా న్యాయ సేవలు పొందవచ్చని తెలుపుతూ,

వాయిస్ (30 సెకన్లు)

---------------------------

ప్రస్తుత విద్యా సంవత్సరానికి జరగనున్న నేషనల్ మీన్స్-కమ్-మెరిట్ స్కాలర్షిప్ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 15వ తేదీ వరకూ గడువును పొడిగించినట్లు ప్రభుత్వ పరీక్షల కార్యాలయ సంచాలకులు డి. దేవానందరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్ పాఠశాలలు, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం 3 లక్షల 50 వేల రూపాయలలోపు ఉన్న విద్యార్థులు అందరూ ఈ పరీక్ష రాసేందుకు అర్హులని పేర్కొన్నారు.

---------------------------

విజయవాడ దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆరవ రోజైన ఈరోజు ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ మహాలక్ష్మి దేవిగా భక్తులకు దర్శనమిస్తున్నారు. సకల సంపదల స్వరూపిణి అయిన మహాలక్ష్మీదేవి అలంకరణలో అమ్మవారిని దర్శించుకుంటే సకలసంపదలు చేకూరుతాయని ఆలయ అర్చకులు తెలిపారు. కాగా దసరా మహోత్సవాలలో భాగంగా శ్రీశైలంలో ఈ రోజు భ్రమరాంబికాదేవి అమ్మవారు కాత్యాయని అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. అలాగే హంసవాహనంపై స్వామి అమ్మవార్ల గ్రామోత్సవాన్ని నిర్వహించనున్నారు

---------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం తొలి వంద రోజుల పాలన పూర్తి చేసుకున్నారు. ప్రజల జీవితాలపై సానుకూల ప్రభావం చూపే విధంగా, తద్వారా వికసిత్ భారత్ 2047 కోసం బలమైన పునాది వేస్తూ, ప్రధానమంత్రి అనేక ముఖ్యమైన నిర్ణయాలను తీసుకున్నారు. కాగా వంద రోజుల్లో రైతుల సంక్షేమం గురించి ఎన్డీఏ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈరోజు మధ్యాహ్నం 3 గంటలకు ప్రసారమవుతుంది.

=====================